క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి ఘనస్వాగతం



వేల్పూర్: అమెరికా పర్యటన ముగించుకొని మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్న బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డికి నియోజవర్గ బీఆర్ఎస్ శ్రేణులు ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రశాంత్‌రెడ్డి ఎర్రవల్లిలో ఉన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఫాంహౌస్‌కు వెళ్లి కలిశారు. నియోజకవర్గ శ్రేణులను కేసీఆర్‌కు పరిచయం చేశారు. కార్యక్రమంలో బాల్కొండ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



బోధన్: సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం దాసరి ధన్‌రాజ్ తన తండ్రి శౌరి రాయలు జ్ఞాపకార్థం స్థాపించిన డీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలోని 75 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను మంగళవారం పంపిణీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మి, ఉపాధ్యాయులు ఆశా, హన్మాండ్లు, శశికళ, నవీన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



రెంజల్: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఎంపీడీవో శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. దండిగుట్ట, రెంజల్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి స్థానిక గ్రామ సంఘాల సభ్యులకు, కార్యదర్శులకు సూచనలు అందించారు. మొదటి విడతలో మంజూరైన పనులను త్వరిత గతిన పూర్తి చేయించాలని సూచించారు. పనులపై నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తప్పవని పేర్కొన్నారు.

ఏఐఎస్‌బీ వార్షికోత్సవం

బోధన్: ఏఐఎస్‌బీ (ఆలిండియా స్టూడెంట్ బ్లాక్) 74వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు నాగరాజు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు రాజన్న, గంగాప్రసాద్, శ్రీను, అన్వేష్, లక్ష్మణ్, మహేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్ అందించాలి



వేల్పూర్: వృద్ధులు, వికలాంగులు, బెడ్‌రెస్ట్‌లో ఉన్నవారికి ఇంటి వద్దే ఆసరా పింఛన్‌ను అందించాలని ఎంపీటీసీ మొండి మహేశ్, మాజీ ఉపసర్పంచ్ పిట్లసత్యం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో వృద్ధులు, వికలాంగుల తరఫున కార్యాలయ సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. పోస్టాఫీస్ వద్ద పింఛన్ తీసుకోవడానికి వచ్చేవారికి కనీస సౌకర్యాలు లేవన్నారు. బెడ్‌రెస్ట్‌లో ఉన్న వృద్ధులు నడవలేక పింఛన్ తీసుకోడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పింఛన్‌దారుల ఇబ్బందులను గుర్తించి నడవలేనివారికి ఇంటి వద్దే పింఛన్ అందించాలని కోరారు.

తోపుడు బండ్ల వితరణ



పెర్కిట్(ఆర్మూర్): పట్టణంలోని వీధి వ్యాపారులకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో తోపుడు బండ్లను మంగళవారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ మాట్లాడుతూ.. చిరు వ్యాపారుల ప్రయోజనం కోసం తోపుడు బండ్లను అందజేసినట్లు తెలిపారు. నిరుపేదలైన చిరు వ్యాపారులు ఈ బండ్లను సద్వినియోగం చేసుకుని వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ పీడీజీ ఎన్వీ హన్మంత్ రెడ్డి, కాంతి గంగారెడ్డి, పట్వారి తులసి కుమార్, లక్ష్మీనారాయణ, పుష్కాకర్ రావు, చరణ్ రెడ్డి, చెలిమెల రాజేందర్, గోనె దామోదర్, శ్రీధర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు



నిజాంసాగర్ కెనాల్ వద్ద నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ఆర్మూర్‌టౌన్: ప్రజల అవసరాలకు అనుగుణంగా రద్దీగా ఉండే ప్రధాన కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఆర్మూర్‌కు నిత్యం వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం వేలాది మంది ప్రజలు వచ్చి వెళ్తుంటారు. కానీ ప్రజలకు ఒకటి, రెండు వస్తే ఉగ్గపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నాటు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా అధికారులు హుటాహుటిన మరుగుదొడ్లు నిర్మించి వదిలేశారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 36వార్డులు ఉన్నాయి. సుమారు లక్షకుపై జనాభా ఉంటుంది. దీనికి తోడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరచూ ఆర్మూర్‌కు వస్తుంటారు. ప్రజలకు ఒకటి, రెండింటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మున్సిపల్ శాఖ అధికారులు ప్రధాన కేంద్రాల వద్ద 36 మరుగుదొడ్లను ఒక్కో యూనిట్‌ను రూ. లక్షతో నిర్మించారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ కేవలం 16 ప్రాంతాల్లో మాత్రమే మరుగుదొడ్లు వినియోగంలో ఉండడం మిగతా ప్రాంతాల్లో వినియోగంలో లేకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జంబిహనుమాన్ ఆవరణ, నిజాంసాగర్ కెనాల్ పక్కన, జాతీయ రహదారి బందాన్ టాకీస్ పక్కన, మామిడపల్లి చౌరస్తాతో పాటు పలు ప్రాంతాల్లో నిర్మించిన వాటికి సరైన అవుట్‌లెట్ లేకపోవడంతో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. దీంతో రూ. లక్షల నిధులు నీటి పాలయ్యాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం



ప్రజల కోసం నిర్మించిన మరుగుదొడ్లను అవసరమైన చోట మరమ్మతు చేపట్టి అందుబాటులోకి తెచ్చి ఇబ్బందులు లేకుండా చూస్తాం. అధికారులకు సూచించి వెంటనే పనులు చేపట్టి అందుబాటులోకి ఉండేలా చూస్తా. పట్టణ అభివృద్ధికి అందరితో కలిసి కృషి చేస్తాం.

– వన్నెల్‌దేవి లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్

వినియోగంలోకి తీసుకొస్తాం



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను త్వరలో వినియోగంలోని తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటా. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. అవసరమైన చోట అవుట్‌లెట్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్

ప్రజాపంథా సిద్ధాంత రూపకర్త డీవీకే



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

బోధన్: ప్రజాపంథా సిద్ధాంత రూపకర్త దివంగత డీవీ కృష్ణ రెండో వర్ధంతి, స్తూప ఆవిష్కరణ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు వి ప్రభాకర్ కోరారు. పట్టణ కేంద్రంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డీవీకే ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకొని విప్లవోద్యమ నిర్మాణం కోసం కృషి చేసిన ఆదర్శ ప్రాయుడన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించే డీవీకే స్తూప ఆవిష్కరణకు పార్టీ జాతీయ కార్యదర్శి ప్రదీప్‌సింగ్, రాష్ట్ర కార్యదర్శి రంగారావు, రాష్ట్ర నాయకులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేశ్, నాయకులు పడాల శంకర్, నాగమణి, గంగామణి, సాయిలు, కిరణ్ పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం



సాలూరలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు



ఎడపల్లిలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు

బోధన్/ ఎడపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల పంట రుణమాఫీని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంపై కాంగ్రెస్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్ర పటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. రైతులకు స్వీట్లు తినిపించారు. కాంగ్రెస్ పార్టీ బోధన్, సాలూర మండలాల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్న రవి, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, నాయకులు అల్లె రమేశ్, చీల శంకర్, టింకల్ హన్మంత్‌రావు పటేల్, భుయ్యాన్ సురేశ్, కేజీ గంగారాం, సొక్కం రవి, చిద్రపు అనిల్, రాములు, కుమ్మన్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేయడంపై ఎడపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావు, ఈరంటి లింగం, బొబ్బిలి శ్రీనివాస్, బంజ కామప్ప, పోల మల్కారెడ్డి, కరటూరి సత్యనారాయణ, జక్కం బాలింగం, ఎల్లయ్య యాదవ్, శంకర్ నాయుడు, మచ్చూరి గంగాధర్, ఈరెండ్ల నవీన్, రత్నాకర్ రెడ్డి, శివరామప్రసాద్, సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

పెర్కిట్(ఆర్మూర్): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శ్రావణ్ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు పత్రీజీ ధ్యాన మహా యజ్ఞం ధ్యాన ఆత్మ జ్ఞాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణా రెడ్డి తెలిపారు. పెర్కిట్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవనాథ సిద్ధేశ్వర పిరమిడ్ ధ్యాన మహా క్షేత్రం, పీఎంసీ వారు సంయుక్తంగా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో ధ్యానంతో పాటు గురువులు, పిరమిడ్ మాస్టర్ల సందేశాలు, అనుభవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆత్మజ్ఞాన సందేశాలు ఉంటాయన్నారు. అలాగే ధ్యానులకు ఉచిత వసతితో పాటు భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమవేశంలో కమిటీ సభ్యులు కూనింటి శేఖర్ రెడ్డి, బొడ్డు దయానంద్, పెంబర్తి నారాయణ, కిష్టయ్య తదితరులు పాల్గొనారు.

హిందూ సంస్థల ఆస్తులను పరిరక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

పెర్కిట్(ఆర్మూర్): పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న హిందూ సంస్థల ఆస్తులను పరిరక్షించాలని హిందూ పరిరక్షణ సమితి సభ్యులు మంగళవారం తహసీల్దార్ గజానన్‌కు వినతిపత్రం అందజేశారు. విగ్రహారాధన చేసే హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కొందరు సిద్ధుల గుట్టపై పిరమిడ్‌ను నిర్మించారని తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. పిరమిడ్‌పై కాషాయ ధ్వజం ఏర్పాటు చేసి విగ్రహారాధన చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సభ్యులు మందుల బాలు, కలిగోట ప్రశాంత్, లక్కీ శ్రీధర్, భరత్ పటేల్, ఉదయ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన దివ్యాంగులు



రుద్రూర్: డిమాండ్ల సాధనకు వికలాంగుల హక్కుల పోరాట సమితి ఇచ్చిన పిలుపు మేరకు మండల కేంద్రం నుంచి దివ్యాంగులు చలో హైదరాబాద్ కార్యక్రమానికి మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు జల్లాపురం సాయిలు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులకు, ఆసరా లబ్ధిదారులకు ఫించన్ పెంచుతామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, హామీ మేరకు డిసెంబర్ నెల నుంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌కు తరలిన వారిలో మండల కార్యదర్శి మోహన్, బంజ శంకర్, గోనె గంగాధర్, సాయిబాబా, పావని తదితరులు ఉన్నారు.

టీబీని నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి సంతోష్

వేల్పూర్: టీబీ వ్యాధిని నిర్మూలించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్ పేర్కొన్నారు. వేల్పూర్ పీహెచ్‌సీలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లకు బీసీజీ వ్యాక్సిన్‌పై మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఇంతకు ముందు చిన్న పిల్లలకు ఇచ్చే ఈ టీకాను పెద్దలకు కూడా ఆగస్టులో ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వీణ, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవిగౌడ్, హెచ్ఈవో నాగమణి, వనమాల, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



వేల్పూర్: మండలంలోని పడగల్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీలు, పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం స్కూలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు విజయ్, లింబాద్రి, రాము, పదోన్నతి పొందిన గంగామోహన్, పీఈటీ సురేశ్‌కుమార్, పదోన్నతిపై కొత్తగా చేరిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మీసాల హేమలత శ్యాంరావు, హెచ్ఎం రాంచందర్‌రావు, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ వసీమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి



రుద్రూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు. ప్రహరీ లేక విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతింటుందని వారు పేర్కొన్నారు. పాఠశాల సెలవు రోజుల్లో ఆకతాయిలు పాఠశాల ఆవరణ, వరండాలో చేరి అపరిశుభ్రంగా మారుస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కారించాలని కోరుతున్నారు.

సమాచారం..

■ నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెర్కిట్(ఆర్మూర్): పట్టణంలో బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33/11 కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతులు నిర్వహిస్తున్నందున రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

■ మండల సర్వసభ్య సమావేశం

పెర్కిట్(ఆర్మూర్): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పస్క నర్సయ్య అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాయిరాం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఆశలు చిగురించేలా..!



వర్షంతో పంట భూమిలో నిలిచిన వర్షపు నీరు



కొత్తపల్లిలో పచ్చదనం సంతరించుకున్న సోయా పంట

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలు అన్నదాతలకు ఆశలు చిగురించేలా చేశాయి. మృగశిర కార్తె వచ్చి రెండు వారాలు గడుస్తున్న భారీ వర్షాలు లేక విత్తిన విత్తనాలు మొలకెత్తే పరిస్థితి కనిపించ లేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చివరికి పంటలపై ఆశలను వదులుకునే పరిస్థితి ఏర్పడింది. కానీ గత వారం రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు విత్తిన మక్క, సోయా, పసుపు పంటల్లో నీరు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆరు తడి పంటలు మక్క, సోయా పంటలు పచ్చదనం సంతరించుకున్నాయి.

బస్సులో దొరికిన పాస్‌బుక్ అందజేత



ప్రయాణికుడికి పట్టాపాస్‌బుక్ అందిస్తున్న కండక్టర్

బోధన్: బోధన్ ఆర్టీసీ డిపో నుంచి జేబీసీ బస్సులో డ్యూటీలో ఉన్న కండక్టర్ అరికెల సంజీవ్ రెడ్డి మంచి మనస్సు చాటారు. మంగళవారం బోధన్ నుంచి కామారెడ్డి జిల్లా బాన్సువాడ రెవెన్యూ డివిజన్ మీదుగా జేబీఎస్‌కు వెళ్తున్న బస్సుల్లో ఓ ప్రయాణికుడు బాన్సువాడ బస్టాండ్‌లో బస్సెక్కి బాల్‌నగర్ బస్టాండ్‌లో దిగిపోయాడు. ప్రయాణికుడు తనవెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ కవర్‌ను కూర్చున్న సీట్లో మర్చిపోయాడు. దీన్ని గమనించిన కండక్టర్ కవర్‌ను తీసుకొని దగ్గర పెట్టుకున్నాడు. కవర్‌లో ప్రయాణికుడి ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, పట్టాదారు పాస్‌బుక్‌లు ఉన్నాయి. తిరుగు ప్రయాణంలో బాల్‌నగర్ బస్టాండ్ కంట్రోలర్ శర్నప్ప సమక్షంలో వాటిని తిరిగి ప్రయాణికుడికి అందించినట్లు సదరు కండక్టర్ తెలిపారు. కండక్టర్, డ్రైవర్‌లకు ప్రయాణికుడు కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

పెర్కిట్(ఆర్మూర్): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వైద్య శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఇంటితో పాటు పరిసరాల్లో నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిలువైన చోట లార్వా వృద్ధి చెంది దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. దీంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయన్నారు. అనంతరం లార్వా సర్వే చేపట్టారు. నీరు నిలువ ఉన్న పాత టైర్లు, కూలర్ల నుంచి నీటిని తొలగించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యాసంస్థలను ఇబ్బందులకు గురిచేయొద్దు'

బోధన్ టౌన్: విద్యార్థుల సమస్యలు ఏవైనా ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని, పాఠశాల, కళాశాల యాజమాన్యాలను ఇబ్బందులకు గురిచేయొద్దని విద్యార్థి సంఘాల నాయకులకు ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. విద్యార్థి సంఘాల నాయకులు యాజమాన్యం అనుమతి లేకుండా స్కూల్స్, కాలేజీలోకి ప్రవేశించి ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. స్టోర్ రూమ్ తాళాలు పగలగొట్టడం, దౌర్జన్యాలకు దిగడం, స్కూలు ఆవరణలో అరవడం లాంటివి చేసి విద్యార్థులను ఇబ్బందులకు చేయొద్దన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం ఇచ్చిన స్కూల్స్ బంద్ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో ఏవైనా స్కూల్స్, కాలేజీలను బలవంతంగా బంద్ చేయించరాదన్నారు. ఒకవేళ విద్యార్థి సంఘాల నాయకులు యాజమాన్యాలకు ఇబ్బంది కలిగేలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్మూర్‌లో..

పెర్కిట్(ఆర్మూర్): విదార్థి సంఘాల నాయకులు నిరసనలు, బంద్‌ల పేరుతో విద్యా సంస్థలకు వెళ్లి వారి విధులకు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఆర్మూర్ ఏసీపీ బస్వా రెడ్డి మంగళవాం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రైవేటు విద్యా సంస్థల యజమానులను భయాభ్రాంతులకు గురిచేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని, ఏవైనా సమస్యలను ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని కోరారు.

ఈటలను కలిసిన ముదిరాజ్ నేతలు



ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న నేతలు

ఎడపల్లి(బోధన్): మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను జిల్లా ముదిరాజ్ సంఘం నేతలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. పార్లమెంట్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకారానికి తరలిన ఎంపీకి అభినందనలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుడిగా ఈటల రాజేందర్‌కు ఎంతో పేరుందని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు యాసాడ నర్సింగ్ అన్నారు. ఎంపీగా గెలిపించిన మల్కాజ్‌గిరి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ నెల 28 నుంచి టైలరింగ్ (30 రోజులు), జూలై 1 నుంచి బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్(30 రోజులు) కోర్సుల్లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతా యన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంత యువతులు (19 నుంచి 45 సంవత్సరాలు) శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, రేషన్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, 5 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఆర్ఎస్ఈటీఐలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం, టూల్ కిట్ అందజేస్తామని, పూర్తి వివరాలకు 08461- 295428ను సంప్రదించాలని సూచించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	హరోంహర (తెలుగు) - 12.00, 6.30; మనమే (తెలుగు)-3.15, 9.45; ఓ ఫైగాడ్ (తెలుగు) - 9.45
స్క్రీన్-2 -	మహారాజ (తెలుగు) - 12.45, 3.50, 6.55, 10.00
స్క్రీన్-3 -	ఓఫైగాడ్ (తెలుగు) - 1.20, 6.45; నింద(తెలుగు)- 4.05, 9.30
స్క్రీన్-4 -	ఓ ఫైగాడ్ (తెలుగు) - 11.55, 3.10; ప్రభుత్వ జూనియర్ కళాశాల (తెలుగు) - 6.25, మరణం(తెలుగు)- 9.15

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇందల్వాయి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ తెలిపారు. ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్ఈవో శంకర్, సందీప్, వెంకటేశ్, వెంకటేశ్వర్లు, సులోచన, సురేశ్, వెంకట్ రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.